GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్ : బుధవారం- డిసెంబర్ 20-2023 పేజీలు : 3

పబ్లిక్ స్కూల్‌తో దేశానికి గొప్ప గుర్తింపు..

శతాబ్ధి వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్ : పబ్లిక్ స్కూల్ ఎంతో మంది ప్రముఖులను అందించిందని, దేశానికి గొప్ప గుర్తింపు తెచ్చిపెట్టిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. అలాంటి పాఠశాల నేడు శతాబ్ధి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. మంగళవారం (డిసెంబర్ 19) బేగంపేట హైదరాబాద్? పబ్లిక్? స్కూల్? శతాబ్ధి వేడుకలకు ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో పాటు గవర్నర్ తమిళి సై సౌందర రాజన్, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి సీతక్క, పలువురు అధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ద్రౌపది ముర్ము జెండా ఊపి పబ్లిక్ స్కూల్ శతాబ్ధి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా వందేళ్ల చరిత్ర కలిగిన హెచ్‌పీస్ మ్యూజియంను ముర్ము సందర్శించారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ ' హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఎంతో మంది ప్రముఖులను దేశానికి అందించింది. అలాగే ఈ పాఠశాల ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచి దేశానికి గొప్ప గుర్తింపును తెచ్చిపెట్టింది. విభిన్న నేపథ్యాల నుండి విద్యార్థులు కలిసచదువుకోవడానికి, ఒకరి నుండి ఒకరు నేర్చుకోవడానికి ప్రోత్సహించే వాతావరణాన్ని సృష్టించినందుకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను. భవిష్యత్‌లో ఈ పాఠశాల మరిన్ని శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని తెలిపారు.అనంతరం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర, దేశాభివృద్ధికి పాటుపడిన ఎంతో మంది ప్రముఖులను పాఠశాల తయారు చేసింది.

మిగతా 2 లో

కరోనా పరీక్షలు చేయండి



-కొత్త వేరియంట్‌తో తెలుగు రాష్ట్రాలు అప్రమత్తం..

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్ : కరోనాసురుడు మళ్లీ తెగబడ్డాడు. దేశవ్యాప్తంగా కోవిడ్ తాలూకు డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. రోజురోజుకూ కరోనా కేసులు పెరగడం, మరణాలు నమోదవ్వడం.. మూడేళ్ల కిందటి పీడకలను మళ్లీ గుర్తు చేస్తోంది. జెఎన్1 పేరుతో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. తొలి కేసు కేరళలో బైటపడింది. దీంతో బీ అలర్ట్ అంటున్నాయి తెలుగు రాష్ట్రాలు.. కోవిడ్ కొత్త వేరియంట్ దేశవ్యాప్తంగా ప్రభావం చూపడం మొదలైంది. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ నియంత్రణ చర్యల్లో బిజీ అయ్యాయి. కేరళ. కర్నాటక రాష్ట్రాలు పూర్తిగా ఎటెన్షన్‌మోడ్‌లోకొచ్చేశాయి. ఇవాళ కర్నాటకలో కోవిడ్ బారిన పడి మరొకరు మృతిచెందారు. బీహార్, ఒడిషా రాష్ట్రాల్లో మృతుల సంఖ్యపై తర్జన భర్జన నడుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా కోవిడ్ అలారమ్ మోగుతోంది.కేంద్రం అలెర్ట్ నోటీస్‌తో అప్రమత్తమైంది తెలంగాణ వైద్య శాఖ. ఆసుపత్రుల సూపరింటెండెంట్లకు ప్రత్యేక ఆదేశాలు వెళ్లాయి. మాస్క్ కరోనా టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో 50 పడకలతో ప్రత్యేక కరోనా వార్డ్ ఏర్పాటైంది.అటు ఏపీలో కూడా అన్నీ ప్రధాన ఆస్పత్రుల్లో ఐసోలేషన్ వార్డుల్ని సిద్ధం చేశారు అధికారులు. కోవిడ్ కేసులు పెరిగితే ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉంది గుంటూరు జనరల్ హాస్పిటల్. ఆక్సిజన్, మెడిసిన్, టెస్టింగ్ కిట్స్ అన్నీ అందుబాటులో ఉంచుకుని, లక్షణాలు కనిపించగానే టెస్టులు చేస్తామని, కానీ ప్రజలు కూడా కొత్త వేరియంట్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.నమోదయ్యే కేసుల సంఖ్య తక్కువే ఐనప్పటికీ, అన్నీ హాస్పిటల్స్‌కీ కోవిడ్ అలెర్ట్ జారీ చేసింది ఏపీ ప్రభుత్వం.

మెడికల్ కాలేజీల్లో ల్యాబ్స్‌ని యాక్టివేట్

హాస్పిటల్, జిల్లా సిబ్బంది అప్రమత్తమయ్యాయి. లక్షణాలు కనిపించినవాళ్లందరికీ వెంటనే పరీక్షలు చేస్తారు. రోజుకు 500 నుండి 1000 టెస్టులు చెయ్యటానికి కిట్స్ సిద్ధంగా ఉన్నాయి.శబరిమల నుండి వచ్చే అయ్యప్ప భక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. శబరిమల వెళ్ళి వచ్చినవారికి కరోనా లక్షణాలు వుంటే టెస్టుల చెయ్యాలని విలేజ్ సెక్రెటరీలకు ఆదేశాలు ఇచ్చారు. ఒక్కో విలేజ్ సెక్రటరీకి 10 ర్యాండమ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచారు.కేరళ,తమిళనాడు హెల్త్ సెక్రెటరీలతో రెగ్యులర్‌గా టచ్‌లో ఉంది ఏపీ సర్కార్. %జీచీ%-1 వేరియంట్‌కి వేగంగా వ్యాపించే గుణం ఉంది.. పైగా ఇది పండగల సీజన్.. జనం అప్రమత్తంగా ఉండాలి.సోషల్ డిస్టెన్స్ పాటించాలి, మాస్క్ పెట్టుకోవాలి, కరోనా లక్షణాలు వుంటే ఎవరికివాళ్లు సెల్ఫ్ ఇసోలెట్ అవ్వాలి..ఇప్పటికిప్పుడు వ్యాక్సిన్ వేసుకున్నా ప్రయోజనం ఉండదు. ప్రస్తుత పరిస్థితిని బట్టి బూస్టర్ డోస్ కూడా అవసరం లేదంటున్నారు వైద్యాధికారులు.ముఖ్యంగా దక్షిణాది మీద పగపట్టినట్టుంది కోవిడ్ కొత్త వేరియంట్. అప్రమత్తత, ఆస్పత్రుల్లో సన్నద్ధత ఏమాత్రం ఉందన్న అంశంపై రేపు రాష్ట్రాల అధికారులతో కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించబోతోంది. నెలాఖర్లోగా.. సెంట్రల్ గవర్నమెంట్ నుంచి ప్రత్యేక ఎడ్వైజరీ రిలీజయ్యే ఛాన్సుంది.

మన సంస్కృతి ప్రతిబింభించేలా తెలంగాణ భవన్

-ఆస్తుల విభజనపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

టీ మీడియా, డిసెంబర్ 19, ఢిల్లీ : తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా దేశ రాజధాని న్యూ ఢిల్లీలో నూతన తెలంగాణ భవన్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. న్యూ ఢిల్లీలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భవన్, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఉమ్మడి ఆస్తుల విభజనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. న్యూ ఢిల్లీలోని తన నివాసంలో ఈ అంశంపై తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, భవన్ ఓఎస్డీ సంజయ్ జాజుతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. భవన్ మొత్తం విస్తీర్ణం ఎంత..? అందులో ఉన్న భవనాలు, వాటి స్థితి, అందులో తెలంగాణ వాటా వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడిగా 19.781 ఎకరాల భూమి ఉందని.. అధికారులు తెలిపారు. ఇందులో ఉమ్మడి భవన్ పరిధిలోని 8.781 ఎకరాల్లో శబరి బ్లాక్, అంతర్గత రోడ్లు, గోదావరి బ్లాక్, 3.359 ఎకరాల్లో ఓల్డ్ నర్సింగ్ హాస్టల్, 7.641 ఎకరాల్లో పటౌడి హౌస్ ఉన్నాయని అధికారులు తెలిపారు.తెలంగాణ వాటా కింద ఎంత భూమి వస్తుందని సీఎం ప్రశ్నించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం మన రాష్ట్రం తెలంగాణకs.245 ఎకరాల భూమి వస్తుందని, ఏపీకి 11.536 ఎకరాలు (41.68:58.32 నిష్పత్తి లో) వెళుతుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ప్రస్తుత భవనాల స్థితి, అధికారులు, సిబ్బంది నివాస గృహాల స్థితిపై సీఎం ఆరా తీశారు%శా% మూడు, నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో చాలా వరకు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయిస్తున్నామని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు%శా% తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నూతన భవనం నిర్మించుకుందామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. అంతకు ముందు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల విభజనపై దృష్టి సారించాలని సీఎం అధికారులను ఆదేశించారు.. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం భవన్ మ్యాప్ ను పరిశీలించారు. ఆస్తుల విభజనపై అధికారులకు పలుసూచనలు ఇచ్చారు.

సమీక్ష

గాంధీభవన్‌లో పి ఎసి సమావేశం తర్వాత, ఆయన ఢిల్లీ టూర్ లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో భర్తీ చేయాల్సిన మంత్రి పదవులపై హైకమాండ్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే, ఎమ్మెల్సీ పదవుల ఆశావహుల లిస్ట్, 90కి పైగా నామినేటెడ్ పదవుల్లో ఎవరెవరిని నియమించాలనే దానిపై రేవంత్ రెడ్డి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. సీఎం రేవంత్ భేటీ, వేణుగోపాల్ మధ్య అరగంటకు పైగా సమావేశం కొనసాగించింది.

ఓటమి ఫ్రస్టేషన్‌తోనే పార్లమెంట్‌లో ప్రతిపక్షాల రాద్ధాంతం

- ప్రధాని మోదీ

టీ మీడియా, డిసెంబర్ 19, న్యూఢిల్లీ:

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేస్తుండటంపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ప్రతిపక్షాలు నిరాశ, నిస్పృహలకు లోనయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు. ఆ ఫ్రస్టేషన్‌తోనే ప్రతిపక్ష పార్టీల సభ్యులు పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీల ఈ తరహా ప్రవర్తన చూస్తుంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వాళ్ల సంఖ్యలు మరింత దిగజారుతాయనిపిస్తోందని ఎద్దేవా చేశారు. కాగా, పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. పలు కీలక బిల్లులకు పార్లమెంట్ ఆమోదముంద్ర వేయించాలని చూస్తున్న కేంద్రానికి ఇది తలనొప్పిగా మారింది. దాంతో ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌లకు కేంద్రం తెరలేపింది. దాంతో ఇప్పటివరకు ఉభయసభల్లో మొత్తం 141 మంది ప్రతిపక్ష ఎంపీలు సస్పెన్షన్‌కు గురయ్యారు.

ప్రధాని అభ్యర్థిగా మల్లికార్జున్ ఖర్గే ..!

-ముగిసిన ఇండియా కూటమి భేటీ

టీ మీడియా, డిసెంబర్ 19, ఢిల్లీ :

దేశ రాజధాని ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం వాడీవేడిగా జరిగింది. బీజేపీని ఎదుర్కోవడానికి ఉమ్మడి వ్యూహం, గత అనుభవాలతోపాటు.. తాజా రాజకీయ పరిస్థితులపై ఇండియా కూటమి నేతలు చర్చించారు. ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే పేరును బెంగాల్ సీఎం మమత ప్రతిపాదించారు. మమత ప్రతిపాదనను ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సమర్ధించారు. ఈవీఎంలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. అయితే మొదట ఎన్నికల్లో గెలుద్దామని , తరువాత ప్రధాని అభ్యర్థిపై చర్చిస్తామని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఢిల్లీలోని అశోక హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు, కీలకమైన సానుకూల అజెండా రూపకల్పన, ఉమ్మడి ర్యాలీల ఏర్పాటు, తదితర అంశాలపై మూడు గంటలకు పైగా కూటమి నేతలు చర్చించారు. ఈ సమావేశానికి 28 పార్టీలు హాజరయ్యాయి.ఈ సమావేశంలో 141 మంది విపక్ష ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడంపై ఇండియా కూటమి నేతలు చర్చించారు. పార్లమెంట్ నుంచి 141 మంది ఎంపీల సస్పెన్షన్ ఖండిస్తూ ఇండియా కూటమి నేతలు తీర్మానం చేశారు. ఎంపీల సస్పెన్షన్ కు నిరసనగా డిసెంబర్ 22న దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి పిలుపిచ్చింది. సమావేశం అనంతరం మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు. ఇండియా కూటమిలోని 28 పార్టీలు ఐక్యంగా ఉన్నాయన్న ఖర్గే.. సీట్ల సర్దుబాటు గురించి రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ెలోక్‌సభ ఎన్నికల లోపు దేశవ్యాప్తంగా 8-10 సమావేశాలు నిర్వహించాలని కూడా కూటమి నేతలు నిర్ణయించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ నేత సోనియాగాంధీ, జైరాం రమేశ్ , ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ , బీహార్ సీఎం నితీష్‌కుమార్ , తమిళనాడు సీఎం స్టాలిన్ , లెఫ్ట్ నేతలు , టీఎంసీ నేతలు హాజరయ్యారు. ఆర్జేడీ అధినేత లాలూయాదవ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, శివసేన ఉద్ధవ్ ఠాక్రే , ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కూడా సమావేశానికి హాజరయ్యారు. కాగా.. ఇండియా కూటమి నేతలు సమావేశం కావడం ఇది నాలుగోసారి . పాట్నాలో తొలిసారి కూటమి సమావేశం జరిగింది. తరువాత బెంగళూర్, ముంబైలో కూడా నేతలు సమావేశమయ్యారు.

ఎంపిలకు వివరణ కోరే హక్కు ఉంది

- నేషనల్ కాంగ్రెస్ (ఎన్‌సిపి) అధ్యక్షుడు శరద్ పవార్

టీ మీడియా, డిసెంబర్ 19, న్యూఢిల్లీ :

ప్రతిపక్ష ఎంపిలకు వివరణ కోరే హక్కు ఉందని నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధ్యక్షుడు శరద్ పవార్ పేర్కొన్నారు. ఎంపిల సస్పెన్షన్‌ను ఖండిస్తూ మంగళవారం రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌కి లేఖ రాశారు. పార్లమెంటు భద్రతపై వివరణ కోరేందుకు ఎంపిలకు చట్టబద్ధమైన హక్కు ఉందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం జవాబు దారీ తనం, పారదర్శకతలకు విరుద్ధంగా ఉందని అన్నారు. ఎంపిల ఆందోళనలు ఘటన తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యులు వివరణ కోరడం సాధారణమేనని, ఈ సమస్యను ఎలా పరిష్కరించాలనే దానిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని లేఖలో పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం ప్రకటన చేయకుండా ఆందోళన చేపట్టిన ఎంపిలను సస్పెండ్ చేయడం సరికాదని అన్నారు. ఆందోళనలో పాల్గొనని సభ్యులను కూడా సస్పెండ్ చేశారని ఎత్తి చూపారు. ఇవి వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న చివరి సమావేశాలు కావడం గమనార్హం. పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై కేంద్రం హోం మంత్రి అమిత్‌షా వివరణనివ్వాలంటూ గత వారంరోజులుగా ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు సుమారు 140 మంది ప్రతిపక్ష ఎంపిలు సస్పెండ్‌కు గురయ్యారు.

భద్రతా వైఫల్యంపై చర్చించకుండా వారణాసి, అహ్మదాబాద్‌లో ఉపన్యాసాలతో బిజీ

- మోదీ, అమిత్ షాపై ఖర్గే ఫైర్

టీ మీడియా, డిసెంబర్ 19, న్యూఢిల్లీ :

పార్లమెంట్ ఉభయసభల నుంచి పలువురు విపక్ష ఎంపీల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా నిరసనలు మిన్నంటాయి. విపక్ష ఎంపీలను మూకుమ్మడిగా సభ నుంచి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని రాజ్యసభలో విపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మంగళవారం కాషాయ పాలకులపై విరుచుకుపడ్డారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిసేవరకూ విపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ విపక్ష పార్టీల సభ్యులు పార్లమెంట్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌ల నేతృత్వంలో విపక్ష ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నారు. ఇంత జరిగినా హోం మంత్రి, ప్రధాని మౌనంగా ఎందుకున్నారు అని రాసి ఉన్న ప్లకార్డులను విపక్ష ఎంపీలు ప్రదర్శించారు. విపక్ష ఎంపీల సస్పెన్షన్ సరైంది కాదని, ఇది ప్రజాస్వామ్యానికి చేటే కాకుండా పార్లమెంట్‌కు మాయని మచ్చగా మల్లికార్జున్ ఖర్గే అభివర్ణించారు. తమను చూసి భయపడే పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేశారని ఖర్గే ఆరోపించారు. లోక్‌సభ భద్రతా వైఫల్యంపై తమ ఎంపీలు పార్లమెంట్ ముందుంచేందుకు ప్రయత్నించారని, పార్లమెంట్ సమావేశాల్లో భద్రతా వైఫల్యం గురించి విపక్షాలు ఆందోళన చెందుతుంటే ప్రధాని, హోంమంత్రి వారణాసి, అహ్మదాబాద్‌లో ఉపన్యాసాలు ఇస్తున్నారని ఖర్గే ఎద్దేవా చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై అవినీతిలో రింగ్‌మాస్టర్

అందరి దృష్టి మాస్టర్ పాత్రపైనే..

గుండెల్లో రైళ్లు ,తీవ్ర ఆందోళన

టీ మీడియా, డిసెంబర్ 19, కాళేశ్వరం:

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి ఒక్కొక్కటిగా జరుగుతున్న పరిణామాలు, ఈ ప్రాజెక్టుకు సంబంధించి కీలక పాత్ర పోషించిన రింగ్ మాస్టర్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జి.నిరంజన్ తాజాగా హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంతో ఈ వ్యవహారం ఎక్కడిదాకా వెళ్తుందోనని రింగ్‌మాస్టర్‌లో ఆందోళన మొదలైంది.

మిగతా 3 లో

అక్రమాస్తుల కేసులో తమిళనాడు మంత్రి దోషి

టీ మీడియా, డిసెంబర్ 19, చెన్నై :

అక్రమాస్తుల కేసులో డిఎంకె నేత, తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి కె. పొన్ముడిని మద్రాస్ హైకోర్టు మంగళవారం దోషిగా నిర్ధారించింది. ఆయన భార్య పి. విశాలక్షిని కూడా దోషిగా పేర్కొంది. శిక్ష విధించడానికి ముందు గురువారం (డిసెంబర్ 21)న కోర్టులో హాజరుకావాలని ఇరువురిని ఆదేశించింది. 2017లో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ జి.జయచంద్రన్ అనుమతించారు. విల్లుపురంలోని అవినీతి నిరోధక చట్టం కేసుల్లో 2016, ఏప్రిల్ 18న ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుని కూడా పక్కనపెట్టింది. సీనియర్ న్యాయవాది ఎన్.ఆర్. సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్షను సస్పెండ్ చేయాలని జడ్జిని కోరారు. ఈ పిటిషన్‌ను డిసెంబర్ 21న విచారిస్తామని చెప్పారు. 2006 ఏప్రిల్ 13 మరియు 2010 మార్చి 31 మధ్య కాలంలో నిందితులు రూ.1.79 కోట్ల అక్రమాస్తులను కూడబెట్టినట్లు ప్రాసిక్యూషన్ పేర్కొంది.

వరుస హత్యల ఘటనలో ఐదుగురు నిందితుల అరెస్టు



టీ మీడియా, డిసెంబర్ 19, కామారెడ్డి:

తెలంగాణలో సంచలనం సృష్టించిన మాక్లూరు వరుస హత్యల ఘటనలో ప్రధాన నిందితుడు ప్రశాంత్ సహా ఐదుగురిని అరెస్టు చేసినట్లు కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ తెలిపారు. నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి.. కేసు వివరాలను ఆమె వెల్లడించారు. నిందితుల వద్ద కారు, బైక్, ఐదు సెల్‌ఫోన్లు, రూ.30 వేల నగదు, భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సదాశివనగర్ పీఎస్‌లో కేసు ఆధారంగా విచారణ కొనసాగుతోందని వెల్లడించారు.' నవంబర్ 29న మాక్లూర్ మండలంలో ప్రసాద్ హత్యకు గురయ్యాడు. మదనపల్లి అటవీ ప్రాంతంలో ప్రశాంత్, వంశీ, విష్ణు అనే ముగ్గురు కలిసి ప్రసాద్‌ను రాళ్లు, కర్రలతో కొట్టి చంపేశారు. అక్కడే మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ప్రసాద్ జైలులో ఉన్నాడని ఆయన్ను కలుద్దామని చెప్పి.. ఈ నెల 1న ఆయన భార్య శాన్వికను ప్రశాంత్ నిజామాబాద్ తీసుకెళ్లాడు. బాసర వంతెన వద్ద ముగ్గురూ కలిసి ఆమెను చంపేసి గోదావరిలో పడేశారు. అదే రోజున అతడి చెల్లి శ్రావణిని సైతం తీసుకెళ్లారు. మెదక్ జిల్లా వడియారం వద్ద ఆమెను చంపి తగులబెట్టారు.ప్రసాద్ వద్దకు వెళ్దామని చెప్పి ఆయన తల్లి, పిల్లలు, మరో చెల్లిని కూడా ప్రశాంత్ తీసుకెళ్లాడు. వారిని నిజామాబాద్ లాడ్జిలో ఉంచారు. డిసెంబర్ 4న తమ్ముడితో కలిసి ప్రసాద్ పిల్లలను ప్రశాంత్ చంపేసి.. మెండోర వద్ద సోన్ బ్రిడ్జి వద్ద నీళ్లలో పడేశారు. డిసెంబర్ 13న మరో చెల్లి స్వప్నను సదాశివనగర్ మండలం భూంపల్లి వద్ద చంపి పెట్రోల్ పోసి తగులబెట్టారు. కుటుంబ సభ్యులు రాకపోవడంతో ప్రసాద్ తల్లి సుశీల లాడ్జి నుంచి పారిపోయింది'' అని సింధూశర్మ వివరించారు. ఆమె కోసం వచ్చిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కామారెడ్డి జిల్లా పాల్వంచ వద్ద ప్రశాంత్, మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రసాద్ కుటుంబ సభ్యుల ఫోన్లు ప్రశాంత్ వద్ద లభించాయని, ఇప్పటి వరకు 4 మృతదేహాలు లభించగా.. ప్రసాద్, ఆయన భార్య మృతదేహాలు లభ్యం కాలేదని ఎస్పీ వివరించారు.

చత్తీస్‌గఢ్ అసెంబ్లీ స్పీకర్‌గా మాజీ సీఎం ఎన్నిక

టీ మీడియా, డిసెంబర్ 19, ఛత్తీస్‌గఢ్ :

ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ స్పీకర్‌గా మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ నియామకమయ్యారు. రమణ్ సింగ్ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రొటెం స్పీకర్ రాంవిచార్ నేతమ్ సభలో ప్రకటించారు. ప్రొటెం స్పీకర్ విజ్ఞప్తి మేరకు సీఎం విష్ణుదేవ్ సాయి, ప్రతిపక్షనేత చరదాస్ మహంత కలిసి రమణ్ సింగ్‌ను స్పీకర్ చైర్ వరకు తీసుకువెళ్లి కూర్చుండబెట్టారు. అనంతరం సీఎం, పొట్రెం స్పీకర్, ప్రతిపక్షతో పాటు మాజీ సీఎం భూపేశ్ బఘేల్ సహా సీనియర్ నేతలంతా రమణ్ సింగ్‌కు అభినందనలు తెలిపారు. 15 ఏళ్ల పాలన, సమర్థవంతమైన నాయకుడంటూ నేతలు కొనియాడారు. ఈ సందర్భంగా స్పీకర్ రమణ్ సింగ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను కొత్త పాత్ర పోషిస్తున్నానన్నారు. నా కొత్త బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ.. రాష్ట్ర అసెంబ్లీని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు. రమణ్ సింగ్ అసెంబ్లీ స్పీకర్ పదవికి నామినేషన్ వేసే ముందు భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పంపారు. స్పీకర్ పదవి నామినేషన్ వేసినందున పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూడాల చర్చలు సఫలం..

-15 వరకు ప్రతి నెల స్టైఫండ్

-ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలో సమ్మెబాట పట్టిన జూనియర్ డాక్టర్ల ను చర్చలకు ఆహ్వానించారు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సమస్యల పైన వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్టైఫండ్ ను రెగ్యులర్ గా వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరిన జూనియర్ డాక్టర్ల వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రతి నెల స్టైఫండ్ 15 వ తేదీ వరకు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో మరో కీలక విషయం పై స్పందించారు మంత్రి దామోదర రాజనర్సింహ. పూర్తి వివరాల్లోకి వెళితే..తమ సమస్యల పరిష్కారానికి విధులకు హాజరు కావడం లేదని సమ్మె నోటీసు ఇచ్చారు జూనియర్ డాక్టర్లు. వైద్యులకు రావలసిన స్టైఫండ్ మూడు నెలలుగా రావడం లేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని సమ్మెకు పిలుపునిచ్చారు జూనియర్ డాక్టర్లు. గత రెండు మూడు నెలల నుంచి తమకు రావాల్సిన స్థాయిఫాన్డ్స్ సరిగా అందడం లేదని స్ట్రైక్ నోటీస్ ఇచ్చారు వైద్యులు. దీనికి సంబంధించిన నోటీస్ డిఎంవికి అందించి మంగళవారం నుండి విధులకు హాజరు కావడం లేదని నోటీస్ ఇచ్చారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 8వేల మంది జూనియర్ డాక్టర్స్ సీనియర్ ప్రెసిడెంట్ డాక్టర్స్ సర్జన్స్ ఇలా వివిధ డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న వైద్యులు రేపటినుండి విధులు బహిష్కరించాలని సమ్మెకు పిలుపు నిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఇంటెన్సివ్ చేస్తున్న హౌస్ సర్జన్లు దాదాపు 2500 మంది, పీజీలో స్పెషాలిటీ చేస్తున్నటువంటి 4000 మంది జూనియర్ డాక్టర్స్ , మరొక 2000మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ 1500 మంది సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులు ఇలా దాదాపుగా వివిధ డిపార్ట్ మెంట్లలో 8వేల మంది వరకు వైద్య విద్యార్థులకు సరైన స్టైఫండ్ అందడం లేదని ఈ కారణం చేత ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని వైద్య విద్యార్థులు సమ్మె బట్ట పట్టారు. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులాగా తమకు స్టఫ్ అండ్ రెగ్యులర్ గా అందే విధంగా రెగ్యులరైజ్ చేయాలని వాళ్ళు డిమాండ్ చేస్తున్నారు.అయితే, సమ్మె అంశం పై వైద్య అధికారులు సోమవారం సాయంత్రం జూడాల తో మాట్లాడి మంగళవారం ఉదయం మంత్రి తో సమావేశానికి అవకాశం కల్పించారు. ఈ సమావేశం లో జూడాల ప్రధాన సమస్య అయిన స్టైఫండ్ ను ప్రతి నెల 15వ తేదీ వరకు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు మంత్రి. దీంతో పాటు ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఉస్మానియా ఆసుపత్రి పెండింగ్ అంశం పై కూడా రెస్పాండ్ అయ్యారు మంత్రి. హెరిటేజ్ బిల్డింగ్ నీ కదిలించ కుండా వచ్చే రెండు నెలలో ఉస్మానియా ఆసుపత్రి కొత్త బిల్డింగ్ కి శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు మంత్రి. దీనిపై కేవలం వైద్య విద్యార్థులు మాత్రమే కాదు.. యావత్ తెలంగాణ ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనాల నిర్మాణం పనులను వీలైనంత త్వరగా మొదలుపెట్టాలని, అతి తక్కువ సమయంలో ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరుకుంటున్నారు.

జ్ఞానవాపి కేసులో ముస్లింల పిటీషన్లు కొట్టివేత

టీ మీడియా, డిసెంబర్ 19, అలహాబాద్:

జ్ఞానవాపి మసీదు కేసులో ముస్లింలు దాఖలు చేసిన పిటీషన్లను అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చింది. ముస్లింలు దాఖలు చేసుకున్న అయిదు పిటీషన్లను కోర్టు కొట్టిపారవేసింది. ఈ కేసులో ఆరు నెలల్లోనే విచారణను పూర్తి చేయాలని వారణాసి కోర్టుకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జ్ఞానవాపి మసీదులో పూజలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలంటూ హిందువులు పిటీషన్ వేసిన విషయం తెలిసిందే. ఆ పిటీషన్ ఆధారంగానే ఆ మసీదులో సైంటిఫిక్ సర్వే చేపట్టారు. ఆ నివేదికను కూడా ఇటీవల కోర్టుకు సమర్పించారు. అయితే హిందువుల పిటీషన్లను సవాల్ చేస్తూ ముస్లింలు దాఖలు చేసిన పిటీషన్లను అలహాబాద్ హైకోర్టు ఇవాళ కొట్టిపారేసింది. ముస్లింలు మొత్తం అయిదు పిటీషన్లు దాఖలు చేశారు. సున్ని సెంట్రల్ వక్ఫ్‌బోర్డు, అంజుమన్ ఇంతెజామియా మసీద్ కమిటీ ఆ పిటీషన్లు వేశాయి.

రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

టీ మీడియా, డిసెంబర్ 19, సిద్దిపేట :

దుబ్బాక నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, నూతన రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. నియోజకవర్గంలోని మంజూరైన రోడ్ల అభివృద్ధి పనులను, అలాగే కొత్త రోడ్ల మంజూరు కోసం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాకలో ట్రాఫిక్ దృష్ట్యా దుబ్బాక చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. దుబ్బాక మండల హబ్సిపూర్ నుంచి దుబ్బాక వరకు డబుల్ రోడ్‌ను ఫోర్ లైన్ రోడ్‌గా, మిరుదొడ్డి మండలంలోని అందె గ్రామం నుంచి దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్ వరకు డబుల్ రోడ్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జరుగుతున్న రోడ్ల పనులను అడిగి తెలుసుకున్నారు. దశల వారీగా నియోజకవర్గంలో రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. సమీక్షలో ఆర్ అండ్ బీ ఈఈ బాలప్రసాద్, దుబ్బాక డీఈ వెంకటేశం, దౌల్తాబాద్ ఏఈఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం..

- ఇద్దరు యువకులు మృతి

టీ మీడియా, డిసెంబర్ 19, సంగారెడ్డి :

సంగారెడ్డి జిల్లాలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాందేడ్ %--% అకోల రహదారిలో మామిడిపల్లి ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని లారీ ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు అరబిందో పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులుగా గుర్తించారు. మృతులను శ్రీకాకుళం చెందిన వారని పోలీసులు తెలిపారు.

శ్రీవారి ఆలయంలో

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

టీ మీడియా, డిసెంబర్ 19, తిరుమల

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా జరిగింది. డిసెంబరు 23న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగు గంటల పాటు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో వందల సంవత్సరాలుగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గర్భాలయం, ఉప ఆలయాల గోడలకు ముప్పు వాటిల్లకుండా సుగంధభరితమైన పరిమళ ద్రవ్యాలతో ప్రోక్షణం చేసినట్టు తెలిపారు. కాగా, వేకువజామున స్వామివారికి తిరుప్పావై నివేదించిన ఆనంతరం శ్రీవారి మూలవిరాట్టును పట్టు పరదాతో కప్పి వేశారు. అనంతరం ఆనందనిలయం మొదలుకుని బంగారు వాకిలి వరకు, ఆలయంలోని ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. శుద్ధి పూర్తి అయిన తర్వాత నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఆలయశుద్ధి చేసిన అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్యం కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టదళ పాదపద్మారాధన సేవ రద్దయింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు యానాదయ్య, అశ్వర్థనాయక్, నాగసత్యం, డా.తిప్పేస్వామి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో నందకిషోర్, పేష్కార్ శ్రీహరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడుతాం

- ఎమ్మెల్యే గంగుల

టీ మీడియా, డిసెంబర్ 19, కరీంనగర్ :

కరీంనగర్ చరిత్రలో లేని విధంగా వరుసగా నాలుగుసార్లు గెలిపించిన కరీంనగర్ ప్రజలకు రుణపడి ఉంటానని, నా చివరి క్షణం వరకూ ప్రజల కోసమే పని చేస్తానని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదిహేను సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా కరీంనగర్ నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేశానని తెలిపారు. వ్యవసాయం దండగ అనే పరిస్థితి నుండి..వ్యవసాయం పండగ అనే పరిస్థితికి తీసుకొచ్చామని తెలిపారు. ప్రభుత్వం ప్రజల పక్షం ఉండాలని.. జవాబుదారీగా పని చేయాలని..ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే పోరాడతామని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు వంద రోజుల వరకు ఎదురు చూస్తామని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే నిరసన తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోరాటాలు బీఆర్ఎస్ కు కొత్తేమీ కాదని, మేము రొడ్డేక్కే పరిస్థితి ప్రభుత్వం తెచ్చుకోవద్దని హితవు పలికారు.ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. ప్రజా సమస్య ల పరిష్కారం కోసం క్షేత్ర స్థాయిలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిట్టల కరుణ రవీందర్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్‌తో దేశానికి గొప్ప గుర్తింపు..

మొదటిపేజీ తరువాయి

ఎంపీలు, ఎమ్మెల్యేలు, బ్యాంకింగ్ దిగ్గజాలు, సీఏలు, న్యాయవాదులు.. ఇలా పలు రంగాలకు చెందిన ప్రముఖులు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. క్రీడలు, విద్యా కార్యకలాపాలు విద్యాసంస్థలకు రెండు కళ్ళు కాబట్టి విద్యార్థులు చదువుపైనే కాకుండా క్రీడలపై కూడా దృష్టి సారించాలి' అని పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా స్కూల్ యాజమాన్యానికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు..

- ఈ రూల్స్ తప్పక పాటించాల్సిందే

- హైదరాబాద్ సీపీ

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్ :

న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కొత్త సంవత్సరం వేడుకలను డిసెంబర్ 31న రాత్రి ఒంటి గంట లోపు ముగించాలి. పబ్‌లు, రెస్టారెంట్లతో పాటు ఈవెంట్ నిర్వాహకులు 10 రోజుల ముందే అనుమతి తీసుకోవాలి. ప్రతీ ఈవెంట్‌లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీని తప్పక ఏర్పాటు చేయాలి. 45 డెసిబెల్స్‌కు మించి ఎక్కువ శబ్దం ఉండొద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. ఈవెంట్ సామర్థ్యానికి మించి పాసులు ఇవ్వొద్దని ఆదేశించారు. న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్, గంజాయి వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా లిక్కర్ సరఫరా చేయకూడదన్నారు. పబ్స్‌లో అశ్లీల నృత్యాలు నిషేధం అని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదు. ఒక వేళ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ. 10 వేలు జరిమానా, ఆర్నెళ్లు జైలు శిక్ష విధిస్తామన్నారు. అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సాధారణ పౌరులకు ట్రాఫిక్ సమస్య సృష్టించొద్దని సూచించారు. లిక్కర్ ఈవెంట్స్‌లో మైనర్లకు అనుమతి లేదు. ఒక వేళ అనుమతిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

మహాలక్ష్మి పథకం, మహిళల ఉచిత ప్రయాణం సవరించాలి

టీ మీడియా, డిసెంబర్ 18, గోదావరిఖని :

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మహాలక్ష్మి పథకం మహిళల ఉచిత ప్రయాణం సవరించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు మంగళవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. తెల్ల రేషన్ కార్డు కలిగిన నిరుపేదల మహిళలకు, అదేవిధంగా తెల్ల రేషన్ కార్డు కల్గిన పురుషులకు, కూడా ఉచిత ప్రయాణాన్ని కలిగించాలని తెలియజేయడం జరిగింది. రూ.లక్ష రూపాయలు జీతం కలిగిన మహిళలకు ఈ పథకము నుండి మినహాయించాలని,దీంతో ఆర్టీసీకి కొంత నష్ట తీవ్రత తగ్గుతుందని చెప్పడం జరిగింది.ఈ పరిమితులు లేకుండా మహిళలకు ఉచిత ప్రయాణం చేయడం ద్వారా రైతు బంధు పథకం మాదిరిగానే ధనికుల కు మేలు జరిగేలా,ప్రభుత్వాలకు నష్టం వాటిల్లే ఉందన్నారు.ఉచిత ప్రయాణాలలో ఆటో డ్రైవర్లు జీవితాలు రోడ్డున పడ్డాయని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, అదేవిధంగా ఆటో డ్రైవర్లకు ప్రతినెల రు.3000 రూపాయలను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ కనకం గణేష్,పెద్దపల్లి అసెంబ్లీ ఇంఛార్జి బచ్చలి ఆమని,జిల్లా ప్రచార కమిటీ సభ్యులు క్యాదాసి రమేష్,ఏదుల శంకరయ్య,బచ్చలి రాజయ్య,కుక్క మనోజ్, క్యాదాసి రాజు,దబ్బేట సందీప్, తదితరులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న మహానంది ఏజెన్సీ ఉద్యోగులు

టీ మీడియా, డిసెంబర్ 19, మహానంది:

మహానంది దేవస్థానంలో ఏజెన్సీ ఉద్యోగులుగా పనిచేస్తున్న కాశన్న,మద్దయ్య లు మంగళవారం విధులకు హాజరయ్యారు. విధుల్లో భాగంగా ఆలయం ముందు భాగంలో వెళ్తుండగా పర్సు కనబడింది. దానిని తీసుకుని సుమాచార కేంద్రం వద్దకు చేరుకుని మైకు ద్వారా పర్సు దొరికిందని ప్రచారం చేశారు. నెల్లూరు కు చెందిన క్రాంతి అనే యువకుడు అక్కడికి చేరుకుని వివరాలను వెల్లడించారు. దేవస్థానం అకాంబిడేషన్ ఇంచార్జీ ఎర్రన ఆధ్వర్యంలో బాధితునికి రూ.1,200 వందల నగదుతో ఉన్న పర్సు ను అప్పగించారు. పర్సు అప్పగించినందుకు ఏజెన్సీ ఉద్యోగులకు,దేవస్థానం ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. వారివెంట మధు ప్రసాద్, తదితరులు ఉన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ గవర్నర్

టీ మీడియా, డిసెంబర్ 19, తిరుమల :

తిరుమల శ్రీవారిని ఏపీ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు ఆలయ మర్యాదలతో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి. ధర్మారెడ్డి స్వాగతం పలికారు. ఆయనకు వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఛైర్మన్, ఈవో తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో నందకిషోర్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ డిప్యూటీ సీఎం ను కలిసిన ఎన్ఆర్ఐ ప్రతినిధులు

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్:

సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎన్ఆర్ఐ ప్రతినిధులు కలిశారు. మే 24 నుంచి 26 వరకు అమెరికాలో జరిగే తెలంగాణ అమెరికా తెలుగు సంఘం మహాసభలకు రావాలని ఇన్విటేషన్ ఇచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో ఎన్ఆర్ఐ సంఘం అధ్యక్షులు వంశీ రెడ్డి, ప్రతినిధులు మలిపెద్ది నవీన్, కవితా రెడ్డి, సురేష్ రెడ్డి, గణేష్, జ్యోతిరెడ్డి, మనోజ్ రెడ్డి, దుర్గాప్రసాద్, మనోహర్ తదితరులు ఉన్నారు. మరోవైపు.. ఈ నెల 23న రవీంద్రభారతిలో జరిగే సేవా డేస్ కార్యక్రమానికి రావాలని ఆహ్వానము అందించారు.డిసెంబర్ 10 నుంచి ఈనెల 23 వరకు రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల గురించి వారు డిప్యూటీ సీఎంకు వివరించారు. వరంగల్ లో 38 కంపెనీల సహకారంతో జాబ్ మేళా నిర్వహించగా.. 16,000 మంది హాజరయ్యారని, అందులో 1500 మంది నిరుద్యోగులను ఎంపిక చేసామని చెప్పారు. అదే విధంగా 2024 మే 24 నుంచి 26 వరకు అమెరికాలోని వాషింగ్టన్ లో నిర్వహించే తెలంగాణ అమెరికా తెలుగు సంఘం మహాసభలకు కూడా రావాలని విజ్ఞప్తి చేశారు.

హైకోర్టును ఆశ్రయించిన మాజీ మంత్రి మల్లారెడ్డి

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్:

శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని కోరుతూ.. తెలంగాణ మాజీ మంత్రి మల్లారెడ్డి హై కోర్టును ఆశ్రయించారు. డిసెంబర్ 6న మల్లారెడ్డిపై చీటింగ్, అట్రాసిటీ కేసు నమోదైన సంగతి తెలిసిందే. తమకు వారసత్వంగా రావాల్సిన భూమి వచ్చేలా చేస్తామని మభ్యపెట్టి పీటీ సరెండర్ (ప్రభుత్వానికి తిరిగి అప్పగించడం) చేశారని ఆరోపిస్తూ కేతావత్ భిక్షపతి అనే వ్యక్తి గత నెల 18న ఇచ్చిన ఫిర్యాదుపై శామీర్‌పేట పోలీసులు మల్లారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆయనతోపాటు శ్రీనివాస్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, శివుడు, స్నేహా రామిరెడ్డి, రామిడి లక్ష్మమ్మ, రామిడి నేహారెడ్డిలపై ఐపీసీ 420, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం-2015లోని 3(1)జీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 33, 34, 35లలోని 47 ఎకరాల 18 గుంటల భూమి రాజీ అనే మహిళ పేరిట ఉంది. ఆమెకు భిక్షపతి సహా ఏడుగురు వారసులున్నారు. తమకు వారసత్వంగా చెందాల్సిన భూమి తిరిగి తమ అధీనంలోకి వచ్చేలా చేస్తామని నిందితులు మభ్యపెట్టారని.. తమకు తెలియకుండా గత నెల 3న మూడుచింతలపల్లి తహసీల్దార్ సమక్షంలో పీటీ సరెండర్ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

వంట వార్పు నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలు

- గౌరవ వేతనం వడ్డు కనీస వేతనం ఇవ్వాలి

టీ మీడియా, డిసెంబర్ 19,మహానంది:

గౌరవ వేతనం వడ్డు కనీస వేతనం రూ.26,000 వేల రూపాయలు ఇవ్వాలని జిల్లా అంగన్వాడీ నాయకురాలు నిర్మల అన్నారు. మంగళవారం మహానందిలోని తహసిల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడి కార్యకర్తలు సి.ఐ. టి . యూ ఆధ్వర్యంలో ఎనిమిదవ రోజు వంట వార్పు కార్యక్రమం ద్వారా నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా అంగన్వాడి నాయకురాలు నిర్మల మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని,రాష్ట్రప్రభుత్వం నిరంకుశంగా దుర్మార్గంగా వ్యవహరిస్తూ, అంగన్వాడి సెంటర్ల తాళాలు పాలుగొట్టడం అన్యాయమని, రాష్ట్ర ప్రభుత్వానికి కళ్ళు తెరిపించేలా ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తామని అన్నారు. గౌరవ వేతనం వడ్డు, కనీసవేతనం 26 వేలు ఇవ్వాలని, టీఎలు, డిఏలు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వసతులు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే మా సమస్యలను పరిష్కారం చేసేంతవరకు నిరవధిక సమ్మెలో కొనసాగుతామని అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరించాలంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి, లక్ష్మీనారాయణమ్మ, ఖైరున్, గౌరీ, కొండమ్మ,చండీ దేవి, మహేశ్వరి, పుష్పకళ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే

- చామకూర మల్లారెడ్డి

టీ మీడియా, డిసెంబర్ 19, జవహర్నగర్ :

కళ్యాణలక్ష్మి పథకం ప్రతి నిరుపేద ఇంట్లో ఆనందం నెలకొందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం జవహర్ నగర్ కార్పొరేషన్ తహశీల్దార్ మీటింగ్ హాల్లో తహశీల్దార్ మతిన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చలు మరింత అభివృద్ధి చేసి ఉత్తమ నియోజకవర్గంలా తీర్చిదిద్దుతామని అన్నారు. జవహర్ నగర్ నా గుండెకాయలాంటిదని, జవహర్ నగర్ ప్రజలకు ఎప్పటికి రుణపడి ఉంటానని తెలిపారు. అనంతరం 20మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ శ్రీలక్ష్మి, కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్ రెడ్డి లావణ్యసతీష్ గౌడ్, సతీష్ కుమార్, శారదామనోధర్రెడ్డి, పల్లపు రవి, లక్ష్మి, చిత్రాసుబ్రమణ్యం, శాంతికోటేష్ గౌడ్, నిహారికగౌడ్, కోఆప్షన్సభ్యులు, సీనియర్ నాయకులు మెట్టు వెంకన్న, సింగన్న బాల్రజ్, ఆహ్మద్వాషా, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

20 మంది ఐపీఎస్‌ల బదిలీ..

-డీజీపీగా రవి గుప్తాకు పూర్తిస్థాయి బాధ్యతలు..

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్ :
20 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర డీజీపీగా రవిగుప్తాకు పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించింది. రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా అంజనీకుమార్‌ను నియమించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా రాజీవ్ రతన్‌ను నియమించింది.

బదిలీలు అయిన ఐపీఎస్‌లు వీళ్లే..
1. రాష్ట్ర డీజీపీగా రవిగుప్తా2. రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా అంజనీకుమార్3. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా రాజీవ్ రతన్4. ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్5. స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్ట్6. జైళ్ల శాఖ డీజీగా సౌమ్య మిశ్రా7. సీఐడీ చీఫ్‌గా శిఖా గోయెల్8. రైల్వే %ఉ% రోడ్ సేఫ్టీ డీజీగా మహేశ్ భగవత్9. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా అనిల్‌కుమార్10. హెూంగార్డు ఐజీగా స్టీఫెన్ రవీంద్ర11. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌డైరెక్టర్‌గా కమలాసన్ రెడ్డి12. ఐజీ పర్సనల్‌గా చంద్రశేఖర్ రెడ్డి13. హెడ్ క్వార్టర్స్ జాయింట్ సీపీగా సత్యనారాయణ14. సీఐడీ డీజీగా రమేశ్ నాయుడు15. హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రమేశ్16. ఏసీబీ డైరెక్టర్‌గా ఏఆర్. శ్రీనివాస్17. సెంట్రల్ జోన్ డీసీపీగా శరత్ చంద్ర18. ఎస్‌బీఐ చీఫ్‌గా సుమతి19. హైదరాబాద్ జోన్ ఐజీగా తరుణ్ జోషి20. ఎం.శ్రీనివాసులు (డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేశారు).

ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తాం

పొన్నం ప్రభాకర్

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్:
ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కి మంచి స్పందన వచ్చిందని రవాణా, బీసీ సంక్షేమ శాక మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియా పాయిం ట్‌లో వివరాలను వెల్ల డించారు. మంగళవారం 5,126 దరఖాస్తులు వచ్చాయ తెలిపారు. అందులో ఎక్కువ అప్లి కేషన్లు డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం వచ్చాయని పేర్కొన్నారు.నిరుద్యోగులు కూడా ఎక్కు వ సంఖ్యలో వచ్చారని తెలిపారు. వాళ్ల సమస్యలు ఖచ్చితంగా పరిష్కారం చేస్తామని స్పష్టం చేశారు.మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం ఫ్రీ బస్ అమలు చేస్తున్నాం. బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటో వాళ్లు ఇబ్బంది పడుతున్నారని.. ఆ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.ఆటో వాళ్లు తమ సోదరులే అని..వాళ్లకు ఖచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. సమస్య పరిష్కరించేవరకు ఓపికగా ఉండాలని మంత్రి కోరారు.

హలో మాల... చలో ఢిల్లీ

- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

టి మీడియా, డిసెంబర్ 19, న్యూఢిల్లీ :
రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో మాలలు ఢిల్లీ నడిబొడ్డున జంతర్ మంతర్ చౌరస్తా వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 300 మంది మాలలతో పి వి రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మాల్ల నరసింహ మౌర్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గుమ్మ పు వరప్రసాద్ నాయకుల సారధ్యంలో ఎస్సీ వర్గీకరణ కి వ్యతిరేకంగా హలో మాల.. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఆంధ్ర భవన్ అంబేద్కర్ కి విగ్రహ పూలమాల వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారీ ర్యాలీ తో జంతర్ మంతర్ లో మహాధర్నా నిర్వహించడం జరిగింది. 2005లో భారతదేశపు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో కొట్టివేసిన ఎస్సీ వర్గీకరణ బిల్లును రాజకీయ లబ్ధి కోసం ఈ దేశ ప్రధాని అయిన నరేంద్ర మోదీ బిజెపి ప్రభుత్వం దళితులను ఐక్యంగా అభివృద్ధి జరగకుండా, కేవలం ఓటు బ్యాంకు రాజకీయం కోసం మాల మాదిగల మధ్య మళ్లీ గొడవను సృష్టిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా నియమితులైన రాజ్యాంగ అనుసరిస్తూ నాయకులు సుప్రీంకోర్టు తీర్పును అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలని , పి వి రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్ అన్ని పార్టీలు కేవలం రాజకీయాల కోసం ఎస్సీ వర్గీకరణ అంశం రాజకీయాలు చేయొద్దు అని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు. పోతుల జ్ఞానయ్య. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ, మౌర్య.రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్.సాలే రామారావు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు,. శీలం స్వరూప, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్. అంతోటి జ్యోతి,.రాష్ట్ర కార్యదర్శులు . గొట్టిముక్కల సాలె గోపి, సూర్యాపేట జిల్లా కార్యదర్శి. తాళ్ల ప్రసాదు, కోదాడ మండల నాగార్జున.హుజూర్ నగర్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్. పాలడుగురాజు, పట్టణ అధ్యక్షులు.దగ్గుపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చైనాలో భారీ భూకంపం

116 మంది మృతి

టీ మీడియా, డిసెంబర్ 19, బీజింగ్:
భారీ భూకంపంతో చైనా వణికిపోయింది. భూకంప తీవ్రతతో వాయవ్య చైనాలో పెద్ద సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి. దీంతో 116 మంది మరణించారు. 400 మందికిపైగా గాయపడ్డారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వాయవ్య చైనాలోని గన్సు , కింగ్‌హై ప్రావిన్సులలో భూకంపం వచ్చింది. రిక్టర్ స్కేలుపై దీనితీవ్రత 6.2గా నమోదయింది. భూ అంతర్భాగంలో 35 కిలోమీటర్ల లోతులు కదలికలు సంభవించాయని, గన్సు ప్రావిన్సులోని లాన్‌జ్హౌకు 102 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నదని చైనీస్ మీడియా తెలిపింది. అర్ధరాత్రివేళ భూకంపం రావడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప తీవ్రతకు పలు భవనాలు నేలమట్టమయ్యాయి. దీంతో భారీ నష్టం సంభవించింది. మంగళవారం తెల్లవారుజున అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. నేలకూలిన భవనాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు స్థానిక సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

లోన్ యాప్స్ తొలగింపు

- నిర్మలా సీతారామన్

టీ మీడియా, డిసెంబర్ 19, న్యూఢిల్లీ:
లోన్ యాప్స్ ద్వారా రుణాలు తీసుకునేవారు తిరిగి ఆ రుణాలు చెల్లించలేక ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు ఈ మధ్య కాలంలో చాలా వెలుగుచూశాయి. దాంతో ఇలాంటి వాటిని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగింది. లోన్ యాప్స్ మీద కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ఓ ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో నిర్మలా సీతారామన్ లోన్ యాప్స్ గురించి పేర్కొన్నారు. ప్రజలకు ప్రాణ సంకటంగా మారిన లోన్ యాప్స్‌ను గూగుల్ సంస్థ తొలగిస్తున్నదని తెలిపారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 జూలై మధ్య కాలంలో ఏకంగా 2,500 మోసపూరిత లోన్ యాప్‌లను గూగుల్ తొలగించిందని వెల్లడించారు. ప్రజలను మోసం చేస్తున్న యాప్‌ల మీద కఠినమైన చర్యలు తీసుకుంటామని తన సమాధానంలో నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. వర్షానికి మొలిచిన పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫ్రాడ్ లోన్ యాప్‌ల మీద కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. అందుకోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్రాడ్ లోన్ యాప్స్ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జనం వాటిపై అవగాహన పెంచుకుంటే మోసాల బారినపడకుండా ఉండవచ్చని సూచించారు. మోసపూరిత రుణ యాప్‌లను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలలో భాగంగా, చట్టపరమైన నియమాలను పాటిస్తున్న యాప్‌ల జాబితాను ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గూగుల్‌తో పంచుకుందని తెలిపారు.

కండకర్ కుటుంబానికి అండగా టీఎస్ఆర్టీసీ..

-రూ.40లక్షలు అందజేత.

టీ మీడియా, డిసెంబర్ 19, హైదరాబాద్ :
రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన కండక్టర్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) భరోసా కల్పించింది. బాధిత కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) సహకారంతో రూ.40 లక్షల ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది సెప్టెంబర్ లో మెదక్ డిపోకు చెందిన కండక్టర్ సీహెచ్. అంజయ్య రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. విధులు ముగించుకుని తన స్వగ్రామం నాగపూర్ కి బైక్ పై వెళ్తున్న ఆయనను.. త్రిబుల్ రైడింగ్ తో దూసుకువచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. మెదక్ జిల్లా హవేలి ఘనాపూర్ లోని టీ టైమ్ వద్ద జరిగిందీ ప్రమాదం. ఈ రోడ్డు ప్రమాదంలో సీహెచ్. అంజయ్యకు తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్త స్రావం కావడంతో ఆయన మరణించారు. ఇంటికి పెద్ద దిక్కు మృతి చెందడంతో బాధిత కండక్టర్ కుటుంబంలో విషాదం అలుముకుంది.ఈ ఆపద సమయంలో యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ బాధిత కుటుంబాన్ని ఆదుకుంది. సిబ్బంది, ఉద్యోగుల సాలరీ అకౌంట్స్‌ను ఇటీవల యూబీఐకి టీఎస్ఆర్టీసీ యాజమాన్యం మార్చింది. ఈ ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఉంది. ప్రమాదాలు జరిగిన సమయంలో సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కింద (ఉద్యోగి వేతనం ప్రకారం) కనీసం రూ.40లక్షలు వరకు యూబీఐ అందజేస్తోంది.హైదరాబాద్ బస్ భవన్ లో మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెదక్ డిపో కండక్టర్ సీహెచ్. అంజయ్య కుటుంబానికి రూ.40 లక్షల విలువైన చెక్కును యూబీఐ అధికారులతో కలిసి టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అందజేశారు. రూ.40 లక్షల ఆర్థిక సాయం అందించడంపై కండక్టర్ అంజయ్య భార్య మణెమ్మ తో పాటు కుమారుడు సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. త్రిబుల్ రైడింగ్ తో ర్యాష్ డ్రైవింగ్ కారణంగా నిబద్ధతతో విధులు నిర్వర్తించే అంజయ్య మరణించడం బాధకరమని అన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబ సభ్యులకు సంస్థ అండగా నిలిచిందని, వారు ఆత్మ స్థైర్యం, ధైర్యం కోల్పోకుండా ఉండేందుకు బాధిత కుటుంబానికి ఈ ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు గుర్తు చేశారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకునే ఆర్థిక ప్రయోజనాలతో కూడిన సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ గా ఉద్యోగుల ఖాతాలను యాజమాన్యం మార్చడం జరిగిందని చెప్పారు. ఈ అవకాశాన్ని కల్పించిన యూబీఐకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై అవినీతిలో రింగ్‌మాస్టర్

అందరి దృష్టి మాస్టర్ పాత్రపైనే..

గుండెల్లో రైళ్లు ,తీవ్ర ఆందోళన

టీ మీడియా, డిసెంబర్ 19, కాళేశ్వరం:
లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి ఒక్కొక్కటిగా జరుగుతున్న పరిణామాలు, ఈ ప్రాజెక్టుకు సంబంధించి కీలక పాత్ర పోషించిన రింగ్ మాస్టర్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జి.నిరంజన్ తాజాగా హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంతో ఈ వ్యవహారం ఎక్కడిదాకా వెళ్తుందోనని రింగ్‌మాస్టర్‌లో ఆందోళన మొదలైంది.

1.25లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మాణం..
కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని ఇటు కాంగ్రెస్ పార్టీ, అటు బీజేపీ పార్టీకి చెందిన కేంద్రస్థాయి అగ్రనేతలతో పాటు, రాష్ట్ర స్థాయి నాయకులు కొంతకాలంగా భారీ ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు. దాదాపు 1.25 లక్షల కోట్ల రూపాయల వ్యయ అంచనాతో భారీ స్థాయిలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం, ఇప్పటిదాకా దాదాపు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు అంచనా. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పెట్టుబడిలో భాగంగా, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్, నాబార్డ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ఆర్థిక సంస్థలు దాదాపు 86 వేల కోట్ల రూపాయల రుణం మంజూరు చేసి, ఇందులో అత్యధిక భాగం విడుదల చేశాయి. ప్రాజెక్టు పనులు చాలా వరకు పూర్తవడంతో, ఆ డబ్బులు కూడా కాంట్రాక్టర్లకు చెల్లించారు.

అందరి దృష్టి రింగ్‌మాస్టర్ పాత్రపైనే..
కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు ఆరోపణలు చేసినట్లు, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగి ఉంటే.. దీని మూలంగా నష్టపోయింది ప్రభుత్వ ధనం, ప్రజాధనం మాత్రమే. ఈ అప్పులు తీర్చాల్సిన బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మీదే ఉంది. దీంతో, ఈ ప్రాజెక్టుకు సంబంధించి అటు డిజైనింగ్‌లో, ఇటు ఈ ప్రాజెక్టును వివిధ ప్యాకేజీలుగా విభజించడంలో, అంతిమంగా నిర్మాణ కాంట్రాక్టులో సింహభాగం పొందడంలో రింగ్‌మాస్టర్ పోషించిన పాత్రపై సహజంగానే అందరి దృష్టి పడింది.సిబిఐ విచారణ జరిపించాలని తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తదుపరి విచారణను రెండు వారాల పాటు వాయిదా వేయడంతో పాటు, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. మరోవైపు, ఈ ప్రాజెక్టుపై అసెంబ్లీలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంతో, ఏఏ లొసుగులు బయటకు రానున్నాయనే ఆందోళన కొందరిలో మొదలైంది.

అనుమానాలు ఏంటంటే..
ప్రాజెక్టు టెండర్ల నిబంధనలను రూపొందించడంలో, ప్రాజెక్టును వివిధ ప్యాకేజీలుగా విభజించడంలో కీలక పాత్ర పోషించింది ఎవరు? ఈ ప్రాజెక్టు కాంట్రాక్టులో సింహభాగం దక్కించుకున్నది ఎవరు ? ఇరిగేషన్ శాఖ అధికారులు కొందరితో కుమ్మక్కై.. వారికి వ్యక్తిగత ప్రయోజనాలు చేకూర్చారనే ఆరోపణలు బయటపడటంతో, ఉలిక్కిపడింది ఎవరు ? అంతిమంగా.. ఈ ప్రాజెక్టులో నిజంగా అవినీతి జరిగిందా? ఒకవేళ.. ఈ విషయమై పూర్తిస్థాయి విచారణ జరిగితే.. ఈ మొత్తం వ్యవహారంలో రింగ్‌మాస్టర్ పాత్ర ఏంటనేది, ఈ రింగ్‌మాస్టర్ ఏ స్థాయిలో ప్రయోజనం పొందారన్నది బయటకు రానుంది.

తీవ్ర ఆందోళనలో రింగ్‌మాస్టర్..
తాజా పరిణామాలతో తీవ్ర ఆందోళన చెందుతున్న రింగ్‌మాస్టర్.. వ్యవహారం తమ చేయిదాటి, అంతిమంగా తమ మెడకు చుట్టుకుంటుందేమోనన్న భయంతో ఉన్నారు. వివిధ స్థాయిల్లో తమకున్న పరిచయాలను, పలుకుబడిని ఉపయోగించి.. ఏదోలా దీన్నుంచి బయటపడే మార్గాలపై రింగ్ మాస్టర్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.రాజకీయంగా అత్యంత సునిశితంగా, ప్రధానంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలకు సంబంధించి, మున్ముందు జరుగనున్న పరిణామాలపై ఎంతో ఆసక్తి నెలకొంది. సీబీఐ విచారణతోపాటు, సీరియస్ ఫ్రాడ్స్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ ద్వారా కూడా ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత నిరంజన్ తన పిటిషన్‌లో పేర్కొనడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

విజయమే లక్ష్యంగా క్రీడా స్ఫూర్తిని చాటాలి

- అగ్రికల్చర్ డీన్ డా. జి. కరుణాసాగర్

టీ మీడియా, డిసెంబర్ 19, మహానంది:
విజయమే లక్ష్యంగా క్రీడా స్ఫూర్తిని చాటాలని అగ్రికల్చర్ డీన్ డాక్టర్. జి.కరుణాసాగర్ అన్నారు. మంగళవారం మహానంది ఫారంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో రాష్ట్ర స్థాయి అంతర కళాశాలల క్రీడా పోటీలు అసోసియేట్ డీన్ డాక్టర్ కె ఎస్ ఎస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మహానంది దేవస్థానం ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ కరుణాసాగర్, డాక్టర్ వెంకటేశ్వర్లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, త్రివర్ణ పతకాన్ని మరియు వ్యవసాయ కళాశాల, క్రీడల పతకాలను ఆవిష్కరించారు. అలాగే పావురాలను మరియు బెలూన్లను ఆకాశంలో వదిలారు. అనంతరం క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థిని లు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలను చేసి క్రీడాకారులను అలరింపజేశారు. ఈ సందర్భంగా డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా రంగాల్లో పాల్గొనడం వల్ల ఒత్తిడిని తగ్గించుకొని, సృజనాత్మక పెంపొందించుకొవచ్చని తెలిపారు. వ్యవసాయ కళాశాల,మహానంది వేదికగా ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మూడవ విడత అంతర్ కళాశాలల క్రీడలు, సాహిత్య మరియు సాంస్కృతిక సమ్మేళనం 2023-24 ను ప్రారంభిస్తూ విద్యార్థులు క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల మక్కువ పెంచుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించుకొవడం తద్వారా, సమాజం యొక్క సమ్మిళిత అభివృద్ధికి దారితీస్తుందన్నారు. మహానది దేవస్థానం ఈవో కె. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గెలుపు ఓటములు పక్కన పెట్టి, క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని, అలాగే తమ తమ కళాశాలలకు ప్రతినిధులుగా నిలవాలని తెలిపారు. వివిధ వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ, ఈ క్రీడా పోటీలు నిర్వహించిడంలో ఎలాంటి లోపాలు ఎదురు అవ్వకుండా సజావుగా సాగాలని కోరుతూ, విద్యార్థులు క్రీడా పోటీల్లో విజయాలు సాధించిన విధంగా తక్కువ వర్షపాత మండల రైతాంగం కూడా విజయం సాధించాలని కోరారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్, డాక్టర్ పీ.సాంబశివరావు మాట్లాడుతూ.. ఈ క్రీడల కార్యక్రమం సజావుగా జరగడానికి కళాశాలనందు తగిన ఏర్పాట్లు చేశామని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. కె. యస్.యస్.నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, వ్యవసాయ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలకు చెందిన 527 మంది విద్యార్థులు పాల్గొంటారని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.